# స్వయంమర్ధచోరిణి

“ఏమండీ!”

…………………

‘మిమ్మల్నే!’

…………………

‘అయ్యో! పలకరేం!’

…………………

‘వినిపించుకుంటేగదా చెప్పేందుకు.’

‘ఆ! ఏమిటి.’

‘బియ్యము నిండుకున్నాయి.’

‘మొన్న నేగదా తెస్తా.’

‘ఎంతని తెచ్చారేం.’

‘నాల్గు రూపాయలవి.’

…………………

‘అప్పుడే నిండుకున్నాయా?’

‘నిండుకున్న వనేగా చెప్పేది.’

‘ఇంట్లో వున్న వాళ్ళు ఇద్దర మేగదా.’

‘ఒకప్పుడెవరెక్కువొచ్చారు.’

‘మావాళ్ళెవరు రాలేదు.’

‘మావాళ్లే మీసత్రాల్లో జారిపడుతున్నది.’

‘ఎవరన్నారా మాట.’

‘ఎవరో అంటే నాకెందుకు? మీ రన బట్టే.’

‘నిజమాడితే నిష్ఠూరము.’

‘ఉన్నమాటంటే ఉలుకెక్కువ.’

…………………

‘ఒట్టి అనుమానపు మనుష్యులు.’

‘నిప్పులేంది పొగరాదు.’

…………………

‘సంసారము సాగాలా?’

‘ఇల్లాగయితే సాగినట్లే.’

‘ఐదేళ్ల నుండి చూస్తున్నా నీవరస.’

‘నేను కాపురానికొచ్చే నిండా నాలుగేళ్లు కాలా.’

‘మాటకు మాటెదురు.’

‘ఎదురుకొబట్టే మీముందర నెగ్గకొస్తున్నా.’

## 2

‘ఏం చేస్తున్నావమ్మా! కూతురా’

‘రండీ! పిన్నిగారు’

‘ఈ పూట కేమున్నా తవ్వెడు బియ్యముంటే……’

‘ఆ, అల్లానే తీసికెళ్లండి’

‘మొన్నటివి గూడ కలిపి తెచ్చిస్తాను’

‘వాటికివీటికి కలిపి ఏకంగా డబ్బిచ్చెయ్యండి’

‘డబ్బా’

‘అవునండీ! పిన్నిగారు’

‘ఎంత’

‘కావాలంటే బజార్లో కంటె ఒక సోలెడదనంగానే తీసుకోండి’

‘అబ్బాయికి తెలిస్తే’

‘తెలిస్తేగా’

‘ఏం చేస్తున్నావిదంతా’

‘నిలవచేస్తున్నా’

‘దేనికి?’

‘మే రోజెటు వంటిదో’

‘మనసు పాపిష్టిది’

‘కీడెంచి మేలెంచమన్నారు’

‘పది కాలాలపాటు, పసుపు కుంకుమ బాసుండాలనుకోవాలి’

‘శరీరాలు నీటిమీది బుడగలు’

…………………

‘దీప ముండగనే ఇల్లు చక్కబెట్టుకోవాలి’

## 3

‘చొక్కాయి జేబులో చిల్లర డబ్బులేవి?’

‘కనబడటం లే’

‘లేదు’

‘ఎక్కడ బెట్టేరు?’

‘వంకెకే తగిల్చా’

‘ఎవరొచ్చారు?’

‘ఎవరొస్తారు?’

‘పడుకోబోయేటప్పుడు చూచిన జ్ఞాపకము’

‘జ్ఞాపకమేగా!’

‘ఏమయినట్లు?’

‘నే తీశానంటారా?’

‘ఆ మాట నేనంటానా’

‘మనిద్దరమేగా యింట్లో ఉన్నది’

‘నా జేబు నే తడుముకోనుగదా.’

‘అయితే నే తడుముతానా.’

‘ఏమో చీకట్లో.’

‘ఎవరన్నా వింటే నవ్వుతారు.’

‘నవ్వినవాళ్ళపళ్ళే బయటపడుతవి.’

‘డబ్బులు పోయినట్టేనా.’

‘పోక ఇంకెక్కడ ఉన్నవి.’

‘ఏమాత్రము?’

‘రెండయిదురూపాయల నోట్లు, చిల్లర.’

‘కబ్బులో ఎవరికన్నా యిచ్చి మరచారేమో.’

‘క్లబ్బుకుపోయి ఏన్నాళ్లయింది.’

‘ఎందుచేత?’

‘వచ్చేది పొట్టకూ, బట్టకే చాలటంలే.’

‘ఎవరెక్కువ వచ్చారు?’

‘ధరలు ఆకాశాన్నంటుతున్నవి.’

## 4

‘పాలమనిషి డబ్బులడుగుతున్నదండీ.’

‘అప్పుడే నెలయిందా!’

‘అయి నాల్గురోజులయింది.’

‘ఏమాత్రము ఇవ్వాలేమిటి?’

‘పది చిల్లర.’

‘ఈ నెల చాలా ఎక్కువయిందే!’

‘మీరా మాటనకుండా ఇచ్చిందే నెల్లో,’

‘ఇద్దరికీ ఇంతఖర్చా?’

సి. హెచ్. వెంకటేశ్వర్లు

‘అయితే నే నేమి చెయ్యను?’

‘ఖర్చులు తగ్గించుకోవాలి.’

‘తిండి మానుకోమంటారా?’

‘నేనామాటన్నానా’

…  …  …  …

‘లెక్క సరిగా చూచావా?’

‘ఒకటికి రెండుసార్లు.’

‘పాలు పెరుగు బాగుండటంలే.’

‘అంతకంటె ఈరోజుల్లో ఎవరూ బాగా పోయరు.’

‘పోయిన నెలలో నేగదా గేదెలీనింది.’

‘అయితే వచ్చే నెలనుండి, మీకే వేరేమనిషిని మాట్లాడండి.’

## 5

‘బొగ్గులమనిషి తిరిగిపోతున్నాడండీ’

‘ఎందుకు’

‘రెండుబస్తాలకు డబ్బులివ్వాలి’

‘రెండో బస్తాయెప్పుడేయించుకున్నావు’

‘ఒకబస్తాయే మరి యిన్నాళ్ళొచ్చిందనుకొన్నారా’

‘ఇంకేమీ లేవా’

‘ఇకా రెండురోజులకేమన్నా వస్తవేమో’

‘ఒకబస్తాకే డబ్బులివ్వాలనట్లు జ్ఞాపకమే’

‘ఎవరు’

‘బొగ్గుల మనిషి’

‘ఎప్పుడు?’

‘నిన్ననో, మొన్ననో’

‘సరిగా లెక్కకట్టుకోలే కేమో తిక్కలివాడు’

‘ఎవరు, నేనా’

‘ఎంతమాటలు, నే వలా ఎప్పుడన్నా అన్నానా’

‘ఇప్పుడంటంలే?’

‘మిమల్ని గాదంటినిగా’

## 6

‘ఎదురింటి పిన్నిగారికి చిల్లరడబ్బులివ్వాలండి’

‘ఎందుకు’

‘చేబదులు’

‘ఎప్పుడు’

‘మొన్నమీరూళ్లో లేనప్పుడు తీసుకొన్నా’

‘అంతవసరమేమొచ్చింది’

‘అవసరమే వచ్చింది’

‘ఎవరికి’

‘నాకే’

‘ఎందుకు తీసుకొన్నావు’

‘డబ్బున్న చోకగావస్తే తీసుకొందామని’

‘మొన్న నెల్లో నన్నడిగితీసుకొన్నావుగా’

‘కొనలేదుగా’

‘ఏంచేశావేమిటి’

‘అయిపోయాయి.’

‘ఏమైనాయి?’

‘ఎవరికి జ్ఞాపకముంటది ఎన్నని?’

‘జ్ఞాపకముంచుకోవాలి’

‘వచ్చే నెలనుండి రాసి పెడతాలెండి’ ★